క్లుప్తంగా

వైద్య శిబిరాలతో మెరుగైన సేవలు


వృద్ధులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఉచిత వైద్య శిబిరాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నామని సంజీవిని హోమియో కేర్ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ ఎస్.జవహర్‌రెడ్డి, డాక్టర్ సుస్మితరెడ్డి తెలిపారు. బుధవారం నగర శివార్లలోని బృంద వృద్ధాశ్రమంలో ఉచిత హోమియో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వృద్ధులకు మందులను ఉచితంగా పంపిణీ చేశారు. బృంద వృద్ధాశ్రమ కార్యనిర్వాహకులు బాలసుబ్బయ్య, మేనేజర్ సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరణ

కడప కోటిరెడ్డిసర్కిల్: దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర సమితి డైరీని బుధవారం కలెక్టరేట్‌లో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ వెంకటసుబ్బయ్య డైరీని ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ డైరీలోని సమాచారం ప్రతి ఒక్కరికీ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఏఐటీయూసీ నాయకులు కేసీ బాదుల్లా, ఇన్సాఫ్ నాయకులు ఎస్‌కే మోహిద్దీన్, సుబ్బరాయుడు, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఓబయ్య, మునెయ్య పాల్గొన్నారు.

రైల్వే పోలీసు డైరీ ...

రైల్వే పోలీసు డైరీని బుధవారం రైల్వే డీజీ శ్రీకుమార్ విశ్వజిత్ ఇతర అతిథులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గుంతకల్లు రైల్వే డివిజన్ ఏపీ స్టేట్ పోలీసు వైస్ ప్రెసిడెంట్ వి.జగన్‌మోహన్‌రెడ్డి 2023 సంవత్సర పోలీసు డైరీని డీజీ చేతుల మీదుగా ఆవిష్కరింపజేశారు. ఏపీ స్టేట్ పోలీసు ప్రెసిడెంట్ జనకుల శ్రీనివాస్, గౌరవాధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి, సీఐడీ ప్రెసిడెంట్ అత్తిరాజు, రైల్వే డీజీ మేనేజర్ షఫీ పాల్గొన్నారు.

సంకల్ప దీక్షను జయప్రదం చేయండి

– యూటీఎఫ్ పిలుపు

కడప ఎడ్యుకేషన్: కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 3న కృష్ణాలోని గన్నవరం దీక్షస్థలిలో నిర్వహిస్తున్న సంకల్ప దీక్షను జయప్రదం చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన్‌విజయ్‌కుమార్, పాలెం మహేష్‌బాబు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం కడపలోని యూటీఎఫ్ కార్యాలయంలో దీక్ష వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, నాయకులు సూర్యకుమార్, వెంకటసుబ్బయ్య, అస్లాం బాషా, కిరణ్‌కుమార్, సిద్దయ్య పాల్గొన్నారు.

రక్షణ గోడలను నిర్మించాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: నగరంలోని అల్మాస్‌పేట నుంచి సాయిపేట వరకు బుగ్గవంకకు ఇరువైపులా రక్షణ గోడలను నిర్మించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సుబ్రమణ్యం పేర్కొన్నారు. బుధవారం నగరంలోని అల్మాస్ పేట నుంచి సాయిపేట వరకు బుగ్గవంకను సీపీఐ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుగ్గవంక రక్షణ గోడకు నిధులు మంజూరయినా అరకొర పనులు చేసి వదిలేయడం దారుణమన్నారు. సీపీఐ నాయకులు మద్దిలేటి, అంకుశం, మల్లి, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్‌ను సద్వినియోగం చేసుకోవాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: జిల్లా ప్రజలు పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని కడప డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ గౌస్ ఆజామ్ పేర్కొన్నారు. బుధవారం కడపలోని పోస్టల్ ప్రధాన కార్యాలయంలో పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ దేశంలో మొదటి బీమా సంస్థ అన్నారు. ఇతర బీమా పథకాల కంటే ఎక్కువ రాబడిని ఇస్తుందన్నారు. దేశ వ్యాప్తంగా 1.50 లక్ష పోస్టల్ కార్యాలయాల్లో పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ సేవలను అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పోస్టల్ అసిస్టెంట్ సూపరింటెండెంట్లు విజయ్ భాస్కర్, రామశంకర్, ఇన్‌స్పెక్టర్ రెడ్డిబాషా, పీఎల్ఐ డెవలప్‌మెంట్ మేనేజర్ మునాఫ్ పాల్గొన్నారు.

తైక్వాండో క్రీడాకారుల ప్రతిభ

కడప స్పోర్ట్స్: ఉత్తరప్రదేశ్‌లోని రాయబరేలిలో నిర్వహించిన 39వ జాతీయస్థాయి తైక్వాండో పోటీల్లో జిల్లా క్రీడాకారులు పతకాలు సాధించారు. జనవరి 27 నుంచి 29వ తేదీ వరకు నిర్వహించిన ఈ పోటీల్లో జిల్లాకు చెందిన ఆర్.కళాజ్యోత్స్న రజతపతకం, బి.సాయిప్రీతి కాంస్య పతకం సాధించినట్లు జిల్లా తైక్వాండో సంఘం ప్రధాన కార్యదర్శి నాయబ్‌రసూల్ తెలిపారు.

ఆత్మబంధువుకు అంత్యక్రియలు

కడప అర్బన్: నగర శివార్లలోని ఇందిరానగర్‌లోని శ్రీ పద్మావతి వెంకటేశ్వర వృద్ధాశ్రమంలో 70 సంవత్సరాల సుబ్బమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. వృద్ధాశ్రమ నిర్వాహకులు సమాచారమివ్వగా మేము సైతం సేవాసంస్థ వారు హిందూ సంప్రదాయం ప్రకారం దహన సంస్కారాలను నిర్వహించారు. సంస్థ నిర్వాహకులు ఆర్టీసీ కానిస్టేబుల్ రవి, వంకధారి రాము, రెడ్డెయ్య, పుట్టా పురుషోత్తం, దామోదరం, విజయ్, గురవయ్య, రామరాజు, సురేష్, ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో పారదర్శక పాలన

ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా


గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్: దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో అవినీతి, దళారి వ్యవస్థకు తావులేకుండా అత్యంత పారదర్శక పాలన నడుస్తోందని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా అన్నారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా ఆయన బుధవారం సాయంత్రం స్థానిక 41వ డివిజన్‌లోని రవీంద్రనగర్‌లోని పలు ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరించారు. ఈ పథకాలు పొందడానికి మీరు ఏమైనా లంచాలు ఇచ్చారా అని ప్రజలను అడుగగా వారు లేదని సమాధానమిచ్చారు. వి. లక్ష్మి అనే మహిళ మాట్లాడుతూ జగనన్న అమ్మ ఒడి, ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి నగదు ద్వారా తమ కుటుంబానికి రూ.9.21లక్షల లబ్ధి కలిగిందని తెలిపింది. కె. పావని అనే మహిళ మాట్లాడుతూ తమ కుటుంబానికి జగనన్న అమ్మ ఒడి, వైఎస్సార్ ఆసరా, సున్నా వడ్డీ, ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి నగదు ద్వారా రూ.9.19లక్షల మేలు కలిగిందని సంతోషం వ్యక్తం చేసింది. కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మళ్లీ మళ్లీ సీఎం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో 41వ డివిజన్ ఇన్‌చార్జి జమాల్‌వలీ, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగయ్య, మియ్యా, షఫీ, తోటక్రిష్ణ, ఉమైరర్, సుబ్బారెడ్డి, పస్తం అంజి, షఫీవుల్లా, వెంకట సుబ్బమ్మ పాల్గొన్నారు.

టీడీపీ నాయకులవి పగటి కలలు

– వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్



కడప కార్పొరేషన్: ప్రతిపక్షనేత చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్, టీడీపీ నాయకులు తమ పార్టీ అధికారంలోకి వస్తుందని పగటి కలలు కంటున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్ ఎద్దేవా చేశారు. బుధవారం స్థానిక మారుతీనగర్‌లోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 2014 ఎన్నికల ముందు ఇంటికో ఉద్యోగం అంటూ 'జాబు రావాలంటే బాబు రావాలి' అని టీడీపీ నాయకులు ఊదరగొట్టారని, వారి మాటలు నమ్మి ప్రజలు, యువత 2014లో ఆ పార్టీకి అధికారమిచ్చారన్నారు. ఐదేళ్లలో ఏ ఒక్కరికీ ఉద్యోగం ఇవ్వకపోగా ఉన్న ఉద్యోగాలన్నీ పీకేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. ఇప్పుడు యువగళం పేరుతో పాదయాత్ర చేస్తున్న లోకేష్ తాము అధికారంలోకి వస్తే ప్రతి ఏటా ఉద్యోగ ఖాళీలను భర్తీ చేస్తామని చెప్పడం ప్రజలను వంచించడమేనన్నారు. చంద్రబాబుకు కార్మికులు, ఉద్యోగ, ఉపాధ్యాయులపై చాలా చిన్నచూపు ఉందన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలను గుర్రాలతో తొక్కించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఆయన అధికారంలో ఉన్నన్ని రోజులు ఏనాడు ఉద్యోగులు, ఉపాధ్యాయులను గౌరవించిన పాపాన పోలేదన్నారు. నిరుద్యోగులకు భృతి ఇస్తామని, ఎన్నికలు సమీపించిన చివరి ఏడాది మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకున్నారని గుర్తు చేశారు.

ఫిక్స్‌డ్ పే వర్కర్లకు టైమ్ స్కేల్ వర్తింపు


స్టాండింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ సురేష్ బాబు

- మున్సిపల్ పాఠశాలలకు నైట్ వాచ్‌మెన్ల నియామకం
- నగరపాలక స్టాండింగ్ కమిటీ సమావేశంలో తీర్మానం

కడప కార్పొరేషన్: కడప నగరపాలక సంస్థలో ఫిక్స్‌డ్ పే వర్కర్లుగా విధులు నిర్వహిస్తున్న ఐదుగురికి ఏపీ హైకోర్టు ఆదేశాల మేరకు మినిమమ్ టైమ్ స్కేల్ వర్తింపజేస్తూ నగరపాలక స్టాండింగ్ కమిటీ నిర్ణయం తీసుకుంది. బుధవారం సాయంత్రం మేయర్ కె. సురేష్ బాబు అధ్యక్షతన కడప కార్పొరేషన్ కార్యాలయంలోని ఆయన ఛాంబర్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మొత్తం ఏడుగురిలో ఇద్దరు మరణించగా, ఐదుగురు పనిచేస్తున్నారు. వీరికి మినిమమ్ టైమ్ స్కేల్ వర్తింపజేసి, వారికి ఇవ్వాల్సిన బకాయిలను నాలుగు దఫాలుగా ఇచ్చేందుకు నిర్ణయించారు. కడప నగరపాలక సంస్థకు సంబంధించిన 11 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో విలువైన వస్తువులను కాపాడటానికి తాత్కాలిక ప్రాతిపదికన వాచ్‌మెన్లను నియమించుకోవడానికి అనుమతి మంజూరు చేశారు. నగరపాలక సంస్థకు చెందిన కూరగాయల మార్కెట్లు, జంతు వధశాలలు, మాంసపు అంగళ్లకు 12 నెలల గుత్త కాలం ముగిసినందును బహిరంగ వేలం వేయుటకు తీర్మానించారు. కడప నగరంలోని పుట్లంపల్లి గ్రామ పొలంలో సర్వే నంబర్ 173నందు శ్మశానవాటిక, విద్యుత్ దహన యంత్రాలను లాభాపేక్ష లేని ప్రాతిపదికన ఏర్పాటు చేసి నిర్వహించుటకు నగరపాలక సంస్థకు కేటాయించిన 3.41 ఎకరాలను షరతులతో స్వచ్ఛంద సంస్థలకు అప్పగించేందుకు దరఖాస్తులను ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ ప్రవీణ్‌చంద్, స్టాండింగ్ కమిటీ సభ్యులు సుబ్బారెడ్డి, వి. శిరీష, మేసా ప్రమీల రాణి, షఫీ, హేమలత, ఎస్‌ఈ రత్నాల రాజు, సీపీ సంజీవ్‌కుమార్, ఏసీపీ నాగేంద్ర, డీఈఈలు, ఆర్‌ఓలు పాల్గొన్నారు.

కడపలో సినీతార మెహరీన్ సందడి


రెస్టారెంట్ ముందు జనసందోహం


మాట్లాడుతున్న సినీ నటి మెహరీన్

రాజసం ఫ్యామిలీ రెస్టారెంట్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న డిప్యూటీ సీఎం, ఎమ్మెల్యేలు

కడప కార్పొరేషన్: కడప నగరంలోని సినీతార మెహరీన్ పర్జాదా సందడి చేసింది. స్థానిక ఏడురోడ్ల కూడలి సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన రాజసం ఫ్యామిలీ రెస్టారెంట్ ప్రారంభోత్సవానికి వచ్చేసిన ఆమెను చూసేందుకు అభిమానులు, యువత పెద్ద ఎత్తున హాజరయ్యారు. మెహరీన్‌ను చూడగానే 'హనీ ఈజ్ ద బెస్ట్' అంటూ కేరింతలు కొట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తొలిసారి కడప నగరానికి రావడం చాల సంతోషంగా ఉందన్నారు. రాజసం రెస్టారెంట్ తిరుపతి లోనూ ఉందని, ఇక్కడ వంటకాలు, డిసెష్ ప్రత్యేకంగా, రుచికరంగా ఉంటాయన్నారు. అంతకు ముందు ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా, కమలాపురం ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి రెస్టారెంట్ ప్రారంభోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు పాకా సురేష్ కుమార్, కార్పొరేటర్లు ఉమాదేవి, షఫీ, వైఎస్సార్‌సీపీ నాయకులు ఏ. బాలక్రిష్ణారెడ్డి, సుబ్బారెడ్డి, మేనేజింగ్ పార్టనర్లు పి. రామసుబ్బారెడ్డి, జనార్ధన్‌రెడ్డి, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం దృష్టికి సర్పంచుల సమస్యలు

– మంత్రి ముత్యాల నాయుడు


మంత్రికి సమస్యలను వివరిస్తున్న సంఘం నాయకులు

కడప సెవెన్‌రోడ్స్ : రాష్ట్రంలో సర్పంచులు ఎదుర్కొంటున్న సమస్యలను సీఎం వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని రాష్ట్ర పంచాయతీ రాజ్‌శాఖ మంత్రి ముత్యాల నాయుడు హామీ ఇచ్చినట్లు జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు కొనిరెడ్డి శివచంద్రారెడ్డి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ సర్పంచుల ఐక్యవేదిక సమావేశం బుధవారం తాడేపల్లిలోని వైఎస్సార్ కాంగ్రెస్ కేంద్ర కార్యాలయంలో నిర్వహించగా మంత్రి ముత్యాల నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచుల ఐక్యవేదిక నాయకులు మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘ నిధులు కేంద్రం నుంచి వచ్చిన వెంటనే బిల్లులు అప్‌లోడ్ చేసిన సర్పంచులకు విడుదల చేయాలని కోరారు. తమ గౌరవ వేతనాన్ని రూ.3 వేల నుంచి రూ. 15 వేలకు పెంచాలన్నారు. గ్రీన్ అంబాసిడర్లకు రాష్ట్ర ప్రభుత్వమే జీతాలు ఇవ్వాలని కోరారు. మైనర్ పంచాయతీల కరెంటు బిల్లులను ప్రభుత్వమే భరించాలన్నారు.

రక్తదానానికి ముందుకు రావడం అభినందనీయం

– డీఎంఅండ్ హెచ్‌ఓ నాగరాజు

వైవీయూ: రక్తదానం చేసేందుకు నేటికీ సందేహిస్తున్న ప్రస్తుత తరుణంలో యువతులు రక్తదానం చేసేందుకు ముందుకు రావడం అభినందనీయమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె. నాగరాజు పేర్కొన్నారు. బుధవారం కడప నగరంలోని నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో నోబుల్ స్వచ్ఛంద సేవాసంస్థ, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ రక్తకొరత లేని సమాజం యువతతోనే సాధ్యమన్నారు. వైవీయూ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా. ఎన్. వెంకట్రామిరెడ్డి , నెహ్రూ యువకేంద్రం జిల్లా అధికారి మణికంఠ, నోబుల్ సేవాసంస్థ వ్యవస్థాపకులు వెంకటసుబ్బయ్య, రామాంజనేయులు, కిరణ్‌గంగిరెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

ఫీల్డ్ ఆర్చరీ పోటీల్లో జిల్లాకు పతకాల పంట

– 18 పతకాలు కైవసం

కడప స్పోర్ట్స్: జనవరి 26 నుంచి 29వ తేదీ వరకు మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో నిర్వహించిన 13వ జాతీయ ఫీల్డ్ ఇండోర్ ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో జిల్లా క్రీడాకారులు సత్తాచాటారు. జాతీయస్థాయి పోటీల్లో ఏపీ జట్టుకు 24 పతకాలు రాగా ఇందులో జిల్లాకు చెందిన క్రీడాకారులు 18 పతకాలు సాధించడం విశేషం. జిల్లాకు చెందిన క్రీడాకారులు భువనేశ్వర్, దర్శిణి, పి.వి.సాయిశ్రీనివాస్, తేజశ్రీ, లేహ్య, అభినయ్, మహిత్, దీక్షిత్, రిశ్వంత్‌లు అండర్-10, 14, 17 విభాగాల్లో మొత్తం 18 పతకాలు సాధించినట్లు ఏపీ ఫీల్డ్ ఆర్చరీ అసోసియేషన్ రాష్ట్రకార్యదర్శి వర్ది చెన్నకేశవులు తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులను జాతీయ ఫీల్డ్ ఆర్చరీ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి వి. ఉదయ్‌కుమార్, కోచ్ రవిబాబు అభినందించారు.

కార్పొరేట్ కంపెనీలకు ప్రజల ఆస్తులు తాకట్టు



మాట్లాడుతున్న ఎంఏ గఫూర్

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశ ప్రజల ఆస్తులను కార్పొరేట్ కంపెనీలకు తాకట్టు పెడుతోందని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఏ గఫూర్ పేర్కొన్నారు. బుధవారం కడపలోని సీపీఎం కార్యాలయంలో పార్టీ జిల్లా విస్తృత స్థాయి సమావేశాని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగం, పేదరికం, ఆర్థిక అసమానతలు విపరీతంగా పెరిగిపోతుడంటంతో ప్రజల జీవనోపాధిపై నితంరతం దాడులు జరుగుతున్నాయని తెలిపారు. ఈ సమస్యలపై ఈ నెల 22 నుంచి 28 వరకు దేశ వ్యాప్త నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు.సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, నాయకులు బి. నారాయణ, దస్తగిరిరెడ్డి, రామ్మోహన్‌పాల్గొన్నారు.

ఉక్కు పరిశ్రమను విస్మరించడం దారుణం

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో కడప ఉక్కును విస్మరించడం దారుణమని డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శులు వీరణాల శివకుమార్, సగిలి రాజేంద్ర ప్రసాద్ మండిపడ్డారు. బుధవారం కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ నగరంలోని జ్యోతిరావు పూలే సర్కిల్ వద్ద బడ్జెట్ ప్రతులను దహనం చేసి నిరసన చేపట్టారు. జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు కోసం కేంద్రంతో పోరాటాలు చేయాలన్నారు. డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు ఎంఆర్ నాయక్, సునీల్ కుమార్, సురేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కొఠారి కమిటీకి ఆమడదూరంలో కేటాయింపులు

– యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా

కడప ఎడ్యుకేషన్: కొఠారి కమిషన్ విద్యారంగానికి జీడీపీలో 6 శాతం నిధులు కేటాయించాలని చెప్పినా ప్రస్తుత బడ్జెట్‌లో 0.3 శాతం , మొత్తం బడ్జెట్ 2.5 మాత్రమే కేటాయించడం దారుణమని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా, జిల్లా ఆధ్యక్ష, ప్రధాన కార్యదర్సులు మాదన విజయ్‌కుమార్, పాలెం మహేష్‌బాబులు విమర్శించారు. బుధవారం కడపలోని యూటీఎఫ్‌భవన్‌లో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు.విద్యారంగానికి అరకొర నిధులు కేటాయింపు చేయడం ద్వారా విద్యారంగ బాధ్యతల నుంచి ప్రభుత్వం తప్పకుంటున్నట్లు అర్థమవుతుందన్నారు. ఈ బడ్జెట్ వేతన జీవులకు నిరాశ మిగిల్చిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

వస్తు నాణ్యత, ప్రమాణాలపై అవగాహన తప్పనిసరి


మాట్లాడుతున్న బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ జాయింట్ డైరెక్టర్ సుజాత

కడప కోటిరెడ్డిసర్కిల్ : వస్తువు నాణ్యతా ప్రమాణాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని బీఐఎస్ (బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్) జాయింట్ డైరెక్టర్స్ సుజాత, రమాకాంత్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీసీ హాలులో బీఐఎస్ ఆధ్వర్యంలో వస్తువుల నాణ్యతా ప్రమాణాలపై జిల్లాలోని అన్ని శాఖల అధికారులతో అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా వారు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వస్తువుల కొనుగోలు విషయంగా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియజేశారు. లైసెన్స్ లేకుండా విక్రయాలు జరిపే వ్యాపార సంస్థల యజమానులకు జైలు శిక్ష, జరిమానాలు ఉంటాయన్నారు. వైద్య విధాన పరిషత్ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ హిమదేవి, అనస్థీషియా విభాగం హెడ్ డాక్టర్ అనిల్, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ కృష్ణమూర్తి తదితరులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

నేటి నుంచి లూర్దుమాత తిరునాల


ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు, మత గురువులు

కడప కల్చరల్ : కడప నగరం మరియాపురంలోని లూర్దుమాత దివ్యక్షేత్రంలో గురువారం నుంచి ఈ నెల 11వ తేది వరకు తిరునాల నిర్వహించనున్నట్లు మరియాపురం క్యాథడ్రల్ చర్చి విచారణ గురువులు ఫాదర్ బిరుసు రాజా తెలిపారు. బుధవారం మరియాపురం పాత చర్చి ఆవరణలో వారు తిరునాల కమిటీ సభ్యులు, సహాయక గురువు చంద్రతో కలిసి ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1933లో కడప నగరంలో లూర్దుమాత పుణ్యక్షేత్రం వెలిసిందని, అప్పటి నుంచి అన్ని మతాలు, కులాల వారిని కలుపుకుని ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతిరోజు సాయంత్రం 5 గంటల నుంచి వివిధ ప్రాంతాల నుంచి వచ్చే గురువులు దివ్యబలిపూజ నిర్వహిస్తారని తెలిపారు. గురువారం సాయంత్రం 5.30 గంటలకు చర్చి ఆవరణలో గురువులు పతాకా విష్కరణ నిర్వహిస్తారని, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా హాజరవుతారని తెలిపారు. సహాయ గురువు చంద్ర, తిరునాల కమిటీ చైర్మన్ జోసఫ్ మాట్లాడుతూ ఈనెల 10న నగరంలోని డాన్ బాస్కో చర్చి నుంచి లూర్దుమాత ఊరేగింపు ప్రారంభమై మరియాపురం చర్చి వద్దకు చేరుతుందన్నారు. 11న ఉదయం 8.30 గంటలకు క్రైస్తవ గురువులు, డయాసిస్ బిషప్ గాలి బాలి ఆధ్వర్యంలో సమిష్టి బలిపూజ నిర్వహిస్తారన్నారు. ఉదయం 10.30 నుంచి వాలీబాల్‌పోటీలు, అన్నదానం, చెక్క భజన, ఎద్దుల బండలాగుడు పోటీలు, బహుమతుల ప్రదానం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు.

విద్యార్థులకు బహుమతి ప్రదానం


విజేతలైన విద్యార్థులతో నిర్వాహకులు

కడప కల్చరల్ : తిరుమల-తిరుపతి దేవస్థానాల అనుబంధ సంస్థ హిందూ ధర్మ ప్రచార పరిషత్ కడపశాఖ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక పాత బస్టాండులోని విశ్వహిందూ పరిషత్‌కార్యాలయంలో పాఠశాల విద్యార్థులకు పలు ధార్మిక పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా విష్ణు సహస్ర నామం, అచ్యుతాష్టకం, పఠన పోటీలలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పదేళ్లలోపు విద్యార్థులకు అచుత్యాష్టకం, 15 ఏళ్లలోపు విద్యార్థులకు విష్ణు సహస్ర నామ పారాయణంపై పోటీలు జరిగాయి. మూలె రామమునిరెడ్డి, సి.వెంకట సుబ్బారెడ్డి, ఎం.చెన్నరాయలు, కొత్త నరసింహులు, చింతకుంట శివారెడ్డి, గండ్లూరి కృష్ణ మోహన్, నాగరత్న సత్యాంబలు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. వ్యాసాశ్రమం అధిపతి శ్రీ నారాయణ నందగిరి స్వామి ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులను అందజేశారు. సేవకులు బెస్తవేముల రామమహేష్, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ప్రోగామ్ అసిస్టెంట్ టి.గోపిబాబు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

రోడ్డు విస్తరణ పనులను పూర్తి చేయాలి


సీఎంఆర్‌పల్లెలో రోడ్డు విస్తరణకు సంబంధించిన మ్యాపును పరిశీలిస్తున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

కడప కార్పొరేషన్: కడప నగరంలోని మాసాపేటలో రోడ్డు విస్తరణ పనులను త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. బుధవారం నగరాభివృద్ధిలో భాగంగా జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. మాసాపేటలో రోడ్డుకు ఇరువైపులా లెవెల్స్ ఆధారంగా నీరు నిలవకుండా కాలువలు, రోడ్ల నిర్మాణ పనులను పూర్తి చేయాలన్నారు. తాగునీటి కోసం ఏర్పాటు చేస్తున్న పైపులైన్ పనులను మూడు రోజుల్లో పూర్తి చేయాలన్నారు. అంగడివీధిలో రోడ్డు విస్తరణకు ఆక్రమణదారులకు నోటీసులివ్వాలని ఆదేశించారు. బయనపల్లెలో నిర్మిస్తున్న రోడ్డు నిర్మాణ పనులను తనిఖీ చేసి నాణ్యతా లోపాలున్నాయని గుర్తించి పనులు ఆపాలని ఆదేశించారు. అంతకుముందు మార్నింగ్ విజిట్‌లో భాగంగా ఆయన 48వ డివిజన్‌లో పర్యటించి పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలించారు. కొత్తగా ఇళ్లు నిర్మించుకునేవారు వ్యర్థాలను కాలువల్లో పడేయరాదని సూచించారు. ఏఎస్ఆర్ నగర్‌లో స్కూల్ వద్దనుంచి కాలువ నిర్మాణానికి అంచనాలు రూపొందించాలని ఆదేశించారు. సిటీ ప్లానర్ సంజీవ్ కుమార్, ఏసీపీ నాగేంద్ర, ఎంహెచ్‌ఓప్రశాంత్‌వర్ధన్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి


ప్రవీణ్ ప్రకాష్‌కు వినతిపత్రమిస్తున్న నాయకులు

కడప ఎడ్యుకేషన్: ఉపాధ్యాయుల సమస్యలను తక్షణం పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు, ఎమ్మెల్సీ అభ్యర్థి యం. వీ. రామచంద్రారెడ్డి కోరారు. ఈ విషయమై బుధవారం విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, విద్యాశాఖ కమీషనర్ ప్రవీణ్‌ప్రకాష్‌ను కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ పాఠశాలల్లో పెరిగిన విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలన్నారు. దీంతో పాటు పలు సమస్యలు వారి దృష్టికి తీసుకెళ్లారు.